క్లుప్తంగా

నేడు మండల సమావేశం

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివరాజు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష ఉంటుందని వివరించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సకాలంలో విద్యాకానుక కిట్లు ఇవ్వాలి



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న డీఈవో

దొరవారిసత్రం : పాఠశాల ప్రారంభమైన వారం లోపు విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేయాలని డీఈవో డాక్టర్ వి.శేఖర్ ఆదేశించారు. ఆయన శుక్రవారం డీవీ సత్రం మండలం ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లను పరిశీలించారు. ఇప్పటి వరకు విద్యార్థులకు అవసరమైన నోట్, పాఠ్యపుస్తకాలు, షూలు, టైలు, బ్యాగులు వచ్చాయన్నారు. ఇంకా రావాల్సినవి కూడా ఒకటి రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ఇవన్నీ పాఠశాల ప్రారంభమైన వారంలోపు ప్రతి విద్యార్థికీ అందజేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఆయన వెంట స్థానిక ఎంఈవో కృష్ణయ్య ఉన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన రోబోటిక్స్ శిక్షణ



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ రోబోటిక్స్ శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఇందులో రాష్ట్రంలోని పలు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇండస్ట్రియల్ రోబోట్ ప్రోగ్రామింగ్, సిములేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కండలేరులో 6.630 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.630 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాపూరమ్మకు ప్రత్యేక పూజలు



రాపూరు: రాపూరు గ్రామదేవత రాపూరమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పాలాభిషేకం, ప్రత్యేక అలంకరణ, సాయంత్రం భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఖాతాల్లో పింఛను సొమ్ము జమ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని పింఛనుదారులకు జూన్ మాసానికి సంబంధించి పింఛను సొమ్మును వారి బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తామని కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు పింఛను సొమ్ము జమ అవుతుందన్నారు. ఇందు కోసం బ్యాంకులో పింఛనుసొమ్ము తీసుకునేందుకు వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేయాలని బ్యాంకు అధికారులను కోరామన్నారు. శనివారం నుంచి 5వ తేదీ వరకు దివ్యాంగులు, తీవ్రమైన అనారోగ్యం కారణంతో వారికి, వితంతువులు, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి సచివాలయ ఉద్యోగులే ఇంటి వద్దకు తెచ్చి అందజేస్తారన్నారు. ఈ ఎండలో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు.

విరివిగా పనులు కల్పించాలి

ఏర్పేడు: ఉపాధి హామీ కింద కూలీలకు విరివిగా పనులు కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. ఆమె శుక్రవారం అంజిమేడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు తగ్గకుండా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కూలీలతో ప్రతి రోజూ మాట్లాడి ఎక్కువ మంది పనులకు వచ్చేలా చూడాలని కోరారు. ఎండతీవ్రత పెరుగుతుండడంతో ఉదయం 6 గంటల నుంచి పనులు ప్రారంభించి 10 గంటలకు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు.

బిందు సేద్యంతో అధిక లాభాలు

ప్రతి ఏటా తగినంత వర్షపాతం నమోదుకావడం లేదు. దీనికితోడు కాలువలు, చెరువులను యథేచ్ఛగా పూడ్చివేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వెయ్యి అడుగుల వరకు బోర్లు వేసినా అరకొర నీరు మాత్రమే అందుతోంది. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాయితీతో బిందు, తుంపర్ల సేద్య పరికరాలు (డ్రిప్, స్ప్రింక్లర్లు) రైతులకు అందజేస్తోంది. తద్వారా అధికంగా పంటలు సాగు చేస్తూ వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తోంది.

– సైదాపురం



రైతు పొలంలో ఏర్పాటుచేసిన డ్రిప్ పైపులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- తక్కువ నీటితో ఎక్కువ పంటల సాగు
- రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం

జిల్లాలో వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. మెట్ట ప్రాంతాల్లో నీటి వనరులు తక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో రైతులు ఇబ్బంది పడకుండా తక్కువ నీటితో బిందు, తుంపర్ల సేద్య పరికరాల వినియోగించాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది 3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం ప్రోత్సహించాలని మైక్రో ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, సర్వే, బిందు, తుంపర్ల సేద్య పరికరాల బిగింపు తదితర అంశాలను రైతు భరోసా కేంద్రాల్లోని ఉద్యాన సహాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గతేడాది 2900 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం ద్వారా సాగు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. 3436 హెక్టార్లలో సాగు చేయడానికి అనుమతులు మంజూరు చేశారు. సుమారు రూ.27 కోట్ల విలువైన పరికరాలను సబ్సిడీతో రైతులకు అందజేశారు. ఈ ఏడాది 3500 హెక్టార్లు లక్ష్యం కాగా ఇప్పటికే సాగు చేసేందుకు రైతులు ముందుకు వచ్చారు.

ఐదెకరాల్లోపు 90 శాతం సబ్సిడీ

ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఐదెకరాలకంటే ఎక్కువగా విస్తీర్ణం ఉన్న



బొప్పాయి పంటకు ఏర్పాటుచేసిన బిందు సేద్యం పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

రైతులకు గరిష్ఠం 12.50 ఎకరాల వరకు రాయితీ పరికరాలు పొందవచ్చు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలపైన రైతులకు 50 శాతం రాయితీ వర్తింపజేస్తారు. 10 ఎకరాలపైన ఉన్న రైతులకు 45 శాతం రాయితీ పరికరాలు ఇస్తారు. రైతులు రైతు భరోసా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవాలి. డాక్యుమెంటేషన్‌ను కంపెనీలే చేస్తాయి. రైతు వాటా కింద చెల్లించే నగదు ఫోన్‌పే ద్వారా మైక్రో ఇరిగేషన్ సంస్థకు చెల్లించవచ్చు.

• అపరాలకూ స్ప్రింక్లర్లు

అపరాలు, గడ్డి పండించుకునే రైతులకు కూడా సబ్సిడీపై స్ప్రింక్లర్లు ఇస్తారు. 5 ఎకరాల్లోపు 50 శాతం. ఆపైన 45 శాతం సబ్సిడీతో అందజేస్తారు.

• రైతులు ఏమి చేయాలంటే..

బిందు, తుంపర్ల సేద్య పరికరాలు పొందాలనుకున్న రైతులు ఆధార్ కార్డు, మీ భూమిలో వన్‌బీ, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను ఆర్‌బీకేల్లో ఇస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. అనంతరం అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి అర్హత ఉంటే మంజూరు చేస్తారు. రైతులకు విద్యుత్ సదుపాయం, బోరు తప్పనిసరిగా ఉండాలి.

డ్రిప్ ఉపయోగాలు..

- పంటలను బట్టి 30–70 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు.
- డ్రిప్ పరికరాలతో పొలంలో ఉన్న మొక్కలన్నింటికీ సమానంగా నీరు అందుతుంది. మొక్క పెరుగుదలలో వ్యత్యాసాన్ని నివారించే వీలుంటుంది.
- పంట సాగులో వేధించే కలుపు సమస్యలను అరికట్టే వెసులుబాటు కలుగుతుంది.
- నీటి ద్వారా ఎరువులు సరఫరా చేస్తుండడంతో పెరుగుదలకు అనుగుణంగా పోషకాలు అందుతాయి.
- ఏక కాలంలో పంట కోతకు వస్తుంది.
- 40 శాతం విద్యుత్ ఆదా అవుతుంది.
- కూలీల ఖర్చులు తగ్గుతాయి.
- పంటలకు చీడపీడలు, పురుగు సమస్య తగ్గుతుంది. ఎత్తుపల్లాలు ఉన్న నేలల్లో సైతం నీటి సరఫరా సులభతరం అవుతుంది. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరానికి 20 నుంచి 30 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

భక్తి శ్రద్ధలతో కలశమాల శోభాయాత్ర



నాయుడుపేట టౌన్ : ఆంజనేయ స్వామి కలశమాల శోభాయాత్ర శుక్రవారం సాయంత్రం స్వర్ణముఖి నది నుంచి పట్టణంలోని అగ్రహారపేటలో వున్న ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఘనంగా నిర్వహించారు. నది నుంచి కలశాలలో జలాలు తీసుకుని శ్రీరామ సంకీర్తనలు, మంగళ వాయిద్యాల నడుమ పట్టణంలో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. కలశాలలోని నీటితో శనివారం ఉదయం నుంచి స్వామికి అభిషేకం చేయనున్నట్టు అర్చకులు తెలిపారు. అనంతరం సింధూరంతో సామూహిక సహస్ర నామార్చణ, అష్టోత్తర నాగవల్లి తదితర ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. సాయంత్రం స్వామి వారి నగరోత్సవంతో హనుమజ్జయంతి వేడుకలు ముగుస్తాయన్నారు. సుంకు వెంకటసుబ్బారావు సోదరులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



కోదండరామస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా చదువుతున్న మహిళలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లో శనివారం హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. పట్టణంలోని కోనేటిమిట్టలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. రేయిన్ డ్రాప్ వాటర్ ప్లాంట్ యజమానులు శివకుమార్, హరి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ చాలీసాను 108 సార్లు పఠించారు.

ఆలయాలు ముస్తాబు

వెంకటగిరి రూరల్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వెంకటగిరిలోని ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విశ్వోదయ కళాశాల ప్రాంగణం నుంచి వెంకటగిరిలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు





పోలేరమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఉభయదాతలు, ఉభయదాతలను సత్కరిస్తున్న ఈవో శశాంక్

నాయుడుపేట టౌన్ : గ్రామదేవత పోలేరమ్మ ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. జాతరను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ సమీపంలో స్థానిక పారిశ్రామికవేత్త పెసల జయప్రకాష్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెసల జయరాజగోపాల్, సోదరులు వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. దేవదాయశాఖ కార్యనిర్వహణ అధికారి శశాంక్ మాట్లాడుతూ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన పోలీసులు, మున్సిపల్ ఇతర శాఖల అధికారులు, జాతర కమిటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా దాతలను దేవదాయ శాఖ ఈవో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పోలేరమ్మ జాతరను మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఈవో శశాంక్‌ను స్థానిక నాయకులు ఆకుల కుబేరు మణి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెసల కిషోర్ బాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దేవత కిషోర్‌శెట్టి, గాదంశెట్టి భాస్కర్, తులాబంధు సుబ్రమణ్యం, సాగర్, ఆలయ పూజారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలి

శ్రీకాళహస్తి: ఖరీఫ్‌లో రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సారి జూన్‌లో వర్షాలు సమృద్ధిగా పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దాసరి జనార్దన్, హేమలత, రంగయ్య, బాలగురవయ్య, మునిశంకర్, శంకరయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

జోరుగా హాకీ శిక్షణా తరగతులు

- కళకళలాడుతున్న క్రీడా మైదానం
- శిక్షణలో పాల్గొంటున్న 45 మంది చిన్నారులు



హాకీ శిక్షణలో బాగంగా వామప్ చేస్తున్న చిన్నారులు



శిక్షణ పొందుతున్న చిన్నారులకు గుడ్డు, అరటి పండు అందిస్తున్న సీనియర్ క్రీడాకారులు

చిల్లకూరు : హాకీకి గూడూరులో మంచి గుర్తింపు ఉంది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు. ఉన్నత స్థానాల్లో ఉంటున్నారు. ఈ క్రమంలోనే గూడూరులో ఎక్కువ మంది హాకీ క్రీడపై మక్కువ పెంచుకుంటున్నారు. మైదానం కూడా అనువుగా ఉండడం, ప్రోత్సాహం ఉండడంతో హాకీ స్టిక్ పట్టుకుని మైదానానికి వచ్చేస్తుంటారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను హాకీలో పోత్సహిస్తుండడంతో పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో హాకీకి ప్రత్యేక కోచ్‌ను నియమించారు.

ఈ ఏడాది కూడా వేసవిలో 40 రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) అధికారులు చర్యలు తీసుకున్నారు. సుమారు 45 మంది చిన్నారులు శిక్షణలో పాల్గొంటున్నారు. వారికి ప్రతి రోజూ ఉదయం 2 గంటలు, సాయంత్రం 2 గంటల శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులు ఎక్కువ మంది ఉండడంతో పట్టణానికి చెందిన పేటీటి చంద్రనీల్ అనే క్రీడాకారుడు తన వంతుగా కోడి గుడ్డు, అరటి పండు అందించేందుకు ముందుకు వచ్చారు. అలాగే శిక్షణా కాలం పూర్తయిన తరువాత సీనియర్ హాకీ క్రీడాకారులు శిక్షణ పొందిన ప్రతి చిన్నారికీ హాకీ స్టిక్‌లు ఇచ్చే ఏర్పాట్లు చేశారు.

దాతలు ముందుకు వస్తే మరింతగా శిక్షణ



“హాకీ క్రీడలో రాష్ట్రంలోనే గూడూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో హాకీలో శిక్షణ పొందిన ఎంతో మంది నేడు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు దేశ రక్షణ రంగంలో కూడా రాణిస్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని తల్లిదండ్రుల తమ పిల్లలను హాకీ శిక్షణకు పంపుతున్నారు. దాతలు ముందుకు వచ్చి హాకీలో శిక్షణ పొందే వారికి మరి కొంత మెరుగైన వసతులు కల్పిస్తే ఇంకా బాగా రాణించే వీలుంటుంది.

– ఆకాష్ దీపక్, హాకీ కోచ్ గూడూరు

• భానుడి భగభగలు



ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన కోట క్రాస్ రోడ్డు

కోట: మండలంలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. ఎండల తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండలు మండిపోతున్నాయి. 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండ తీవ్రతతో రోడ్ల మీదకు రావాలంటే జనం హడలిపోతున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే కోట, విద్యానగర్, కోట క్రాస్ రోడ్డులో రోడ్లు బోసిపోతున్నాయి. సాయంత్రం 7 గంటల సమయంలోను ఉక్కపోత తగ్గడం లేదు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

మృత్యువాత పడుతున్న వన్యప్రాణులు



రైటార్ సత్రం వద్ద వాహనం ఢీకొని మృతి చెందిన చుక్కల దుప్పి (ఫైల్)



చిల్లకూరు పోలీస్ స్టేషన్ సమీపంలో మృతిచెందిన చుక్కల దుప్పి (ఫైల్)

చిల్లకూరు : అటవీ ప్రాంతంలో చుక్క నీరు అందుబాటులో లేకపోవడంతో వన్యప్రాణులు దాహర్తిని తీర్చుకునేందుకు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో అవి కుక్కల దాడులు, వాహనాల కింద పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. చిల్లకూరు మండలంలో ఉత్తరం, పడమర, దక్షిణం వైపున మూడు ప్రాంతాల్లోనూ వందల ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ చుక్కల దుప్పులు ఎక్కువగా ఉన్నాయి. వాటికి గతంలో తాగునీటి వనరులు అధికంగా ఉండేవి. అంతేగాక అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతంలో చిన్న తొట్టెలు నిర్మించి వన సంరక్షణ కమిటీలతో నీటిని నింపి జీవాల దాహార్తిని తీర్చేవారు. గత ఏడాది సక్రమంగా వర్షాలు కురవకపోవడం, అధికారులు నీటిని అందించడంలో విఫలం కావడంతో వన్యప్రాణులు దాహర్తితో అల్లాడిపోతుఆన్నయి. తాగు నీటి కోసం వెంపర్లాడుతూ గ్రామాల వైపు వస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్లు దాటే క్రమంలో వాహనాలు తగిలి మృత్యువాత పడుతుండగా, కొన్ని చుక్కల దుప్పులు కుక్కల బారిన పడి మృతి చెందుతున్నాయి. దీనిపై అటవీ శాఖ అధికారులు దృష్టిసారించి వన్యప్రాణుల దాహర్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా కాలువల పూడ్చివేత



రైటార్ సత్రం వద్ద రోడ్డు పక్కన ఉన్న కాలువను పూడ్చి మట్టి తోలిన లే అవుట్ యజమానులు

చిల్లకూరు : జాతీయ రహదారి పక్కన వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన కాలువలను కొందరు రియల్టర్లు యథేచ్ఛగా పూడ్చివేస్తున్నారు. ఇటీవల జాతీయ రహదారిని ఆనుకుని అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా లేఅవుట్లు వేస్తున్నారు. వాటిలోకి వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటుచేసుకునే క్రమంలో వర్షపు నీరు వెళ్లేందుకు ఉన్న కాలువలను పూడ్చివేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో వర్షం కురిసిన సమయంలో నీరు వెళ్లేందుకు వీలులేకుండా పోతుందని, తద్వారా రోడ్డుపైకి చేరి వాహనాలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇలా జాతీయ రహదారి వెంబడి ఎవరికి వారు కల్వర్టులు, పైపులు వేసుకోవడం, పూర్తిగా పూడ్చివేస్తూ మట్టితోలడం వంటి పనులు చేస్తున్నా ఐజేఎం అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఐజేఎం సైట్ మేనేజర్ నాగరాజును వివరణ కోరగా జాతీయ రహదారి పక్కన కాలువలను పూడ్చి వేసిన విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఎవరైనా కాలువలను పూడ్చివేసి ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాఘవరెడ్డి వైద్య సేవలు అభినందనీయం



రాఘవరెడ్డిని సత్కరిస్తున్న వైద్యులు, ఉద్యోగులు

గూడూరు రూరల్ : హోమియోపతి వైద్య విభాగంలో రాఘవరెడ్డి అందించిన సేవలు అభినందనీయమని గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న హోమియోపతి వైద్య విభాగంలో ఫార్మసిస్టుగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ఎం.రాఘవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ హోమియోపతిలో ప్రాచీన మందులు ఉన్నాయని తెలిపారు. వాటిని రోగులకు ఇవ్వడంలో రాఘవరెడ్డి ఎంతో ఉన్నతంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆయన శేష జీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హోమియోపతి వైద్యులు నాన్సీగ్రేస్, ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ క్రిష్ణారెడ్డి, లహరి, మధుసూదన్‌రావు, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాగుపడిన పీహెచ్‌సీలు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పీహెచ్‌సీలను బాగు చేసింది. ఆధునిక వసతులు కల్పించింది. సిబ్బంది, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందని ద్రాక్ష అన్న పరిస్థితి నుంచి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించే స్థాయికి తీసుకువచ్చింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– దొరవారిసత్రం





దొరవారిసత్రంలోని పీహెచ్‌సీ, పీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన బెడ్లు

- నాడు–నేడు కింద సకల సదుపాయాలు
- కోటి నిధులతో పలు అభివృద్ధి పనులు



తొగరాముడిలోని పీహెచ్‌సీ

దొరవారిసత్రం మండలంలోని మారుమూల ప్రాంతంలో ఉన్న తొరగాముడి పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.50 లక్షలు, డీవీ సత్రం పీహెచ్‌సీకి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో ఆధునిక వసతులు కల్పించారు. రోగులకు అవసరమైన బెడ్లు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, తాగునీటి వసతి, విద్యుదీకరణ తదితరాలు ఏర్పాటు చేశారు. సిబ్బందిని కూడా నియమించడంతో ఓపీల సంఖ్య పెరిగింది. దొరవారిసత్రం పీహెచ్‌సీలో రోజుకు 100 నుంచి 120 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. వివిధ రకాల రక్త పరీక్షలు కోసం రోజుకు 10–15 మంది వస్తున్నారు. తొగరాముడి పీహెచ్‌సీలో 70 నుంచి 90 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. రక్త పరీక్షల కోసం 10 మందిపైగా వస్తున్నారు.


ఆధునిక వసతులు కల్పించారు



దొరవారిసత్రం పీహెచ్‌సీలో గతంలో సరైన వసతులు ఉండేవి కాదు. భవనం కూడా ఎప్పుడో నిర్మించి కావడంతో వర్షానికి ఉరిసేది. ఇప్పుడు ఆధునిక వసతులతో భవనం నిర్మించారు. రోగుల కోసం ఆధునిక సదుపాయాలు కల్పించారు. మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అత్యవసర సమయాల్లో కూడా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

– పాండురంగయ్య, మైలాంగం గ్రామం

మందులు ఇస్తున్నారు



తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల కోసం మెరుగైన వసతులు కల్పించారు. 11 రకాల పరీక్షలు చేస్తున్నారు. గతంలో వైద్యులు ఉండేవారు కాదు. మందులు కూడా లేవని బయటకు రాసిచ్చేవారు. ఇప్పుడు ఎప్పుడు వచ్చినా వైద్యులు ఉంటున్నారు. మందులు కూడా ఇస్తున్నారు. దీంతో రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు.

– గోను ప్రసాద్, తొగరాముడి గ్రామం